క్లుప్తంగా

ఎన్టీటీపీఎస్‌లో విజిలెన్స్ వారోత్సవాలు



ఇబ్రహీంపట్నం: డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక డీఏవీ పాఠశాల విద్యార్థులకు అవినీతి రహిత భారతదేశంగా మారాలంటే ఏమిచేయాలి, యువకుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంస్థ ప్రధాన గేటు వద్ద అవినీతి రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు.

అన్నదానం



చాత్రాయి: మండలంలోని చాత్రాయి గ్రామంలో వేంచేసియున్న అయ్యప్ప స్వామి ఆలయంలో దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదానం చేశారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు దాతల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. డిసెంబర్ 13 వరకు అన్నదానం కొనసాగుతుందని దాతలు పేర్కొన్నారు.

యుటీఎఫ్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



గంపలగూడెం: యుటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. తోటమూలలో జరిగిన మండలశాఖ సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా పీ విజయబాబు, అధ్యక్షుడిగా గౌర్రాజు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పీ వసంతరావు, కే రజిని, ప్రధాన కార్యదర్శిగా పి.ఏడుకొండలు, కోశాధికారిగా పి.కృష్ణయ్య, కార్యదర్శులుగా కోట రాధాకృష్ణ, సీహెచ్ రమేష్, కే శివలక్ష్మీ, జి. రత్నం ప్రసాద్, కే మురళీ, వి. రమేషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో యుటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం. శ్రీను, నాయకులు ముత్తయ్య, చిల్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ జెండా ప్రదర్శన



ఉటుకూరు(గంపలగూడెం): గ్యార్మీ జెండా ప్రదర్శనను గంపలగూడెం మండలం ఉటుకూరులో శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెండా ఇళ్ల ముందుకు రాగానే భక్తులు నీళ్లు వారపోసి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ముస్లిం కమిటీ అధ్యక్షుడు రహంతుల్లా పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడులో నిర్మించిన బాల త్రిపుర సుందరీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయం ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 5న జరగనున్న బింబ, యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం యాగశాల ప్రదక్షణ, పుణ్యాహవచనం, పంచగవ్య, అఖండదీప ప్రజ్వలన తదితర పూజలు చేశారు. ఈ హోమంలో 25 మంది దంపతులు పూజలు నిర్వహించారు.

అరుణాచలంకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

పటమట(విజయవాడతూర్పు): ఏపీఎస్ ఆర్టీసీ ఆటోనగర్ డిపో ఆధ్వర్యంలో అరుణాచలంకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు కె. ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వీసులు ఈనెల 25 రాత్రి 10 గంటలకు ఆటోనగర్ బస్ స్టేషన్ నుంచి 10.45 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. 25న విజయవాడలో బయలుదేరిన బస్సు 26నఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం, సాయంత్రం గోల్డెన్ టెంపుల్ చేరుకుని రాత్రి అక్కడి నుంచి బయలుదేరి 27న ఉదయం అరుణాచలం చేరుతుందన్నారు. అక్కడ గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాచలం నుంచి బయలుదేరి 28న ఉదయం 5.00 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. ఈ యాత్రకు రాను పోను చార్జీ రూ.2,500 (బస్ చార్జీ మాత్రమే) నిర్ణయించామని, 95269 సర్వీస్ నంబర్‌తో ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామని ఆయన తెలిపారు. వివరాలకు 73828 99266 ఫోన్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు

ఎమ్మెల్యే రక్షణనిధి



ఏ కొండూరు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరురూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల్లో ప్రతి గ్రామానికి అన్ని పథకాలకూ సంబంధించి రూ.16 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రతి సచివాలయానికి, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రానికి పక్కా భవనాల నిర్మాణం జరుగుతోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. విద్యుత్, సాగునీరు, తాగునీటి సమస్యలపై పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీలు రాధాకృష్ణ, వెంకటనరసమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఏ.కొండూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థ ప్రవేశపెట్టి గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే ఏర్పాటు చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలంటే జన్మభూమి కమిటీలు చుట్టూ తిరిగి ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు పడకుండా నేరుగా వలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి వారికి అవసరమైన పథకాలు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మీ, జెడ్పీటీసీ భూక్యా గనియా, ఎంపీడీఓ కేవీఎస్ రవికాంత్, వైస్ ఎంపీపీ సిద్దం పద్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.23.29 కోట్ల రుణాలు అందజేత



రైతులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి

నూజివీడు: వ్యవసాయోత్పత్తిని, ఉత్పాదకతను పెంచేందుకు వ్యవసాయ రుణాలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని రైతాంగానికి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శుక్రవారం రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని 423 మంది రైతులకు సొసైటీల ద్వారా రూ.23.29 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే ప్రతాప్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, కౌలు రైతులకు సొసైటీల ద్వారా పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, రైతునేస్తం, కర్షక మిత్ర వంటి స్కీమ్‌ల ద్వారా రుణాలను అందిస్తోందన్నారు. వాటిని తిరిగి సక్రమంగా చెల్లిస్తే మళ్లీ రుణలిచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇచ్చిన రుణాలను రైతులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

సొసైటీలను బలోపేతం చేసిన ఘనత జగన్‌దే

కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలోని సొసైటీలను బలోపేతం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. జిల్లాలో 425 సొసైటీలు, 57 కేడీసీసీబీ బ్రాంచ్‌లు ఉన్నాయని, వీటి ద్వారా రూ.10,400 కోట్ల టర్నోవర్‌ను సాధించి దేశంలోనే ఐదో స్థానంలో, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఎకరాకు గరిష్టంగా ఏ బ్యాంకు ఇవ్వని విధంగా రూ.7 లక్షల రుణాన్ని ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, కేడీసీసీబీ డీజీఎం కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పనే లక్ష్యం


ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు



నూజివీడు బస్టాండు ఆవరణను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

నూజివీడు: ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాల కల్పనే ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు చెప్పారు. నూజివీడు ఆర్టీసీ డిపోను శుక్రవారం సందర్శించిన ఆయన గ్యారేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తున్నందున కార్మికులు బాగా పనిచేసి సంస్థను లాభాల బాటలోకి తీసుకురావాలని సూచించారు. ఆదాయం వచ్చే రూట్‌లలో బస్సులను తప్పనిసరిగా నడుపుతామన్నారు. అద్దె బస్సులతో పాటు సంస్థ బస్సులను నడిపేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామన్నారు. బస్టాండు ఆవరణలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండులోకి వెళ్లేటప్పుడు వర్షపు నీటితో పాటు మురుగు నీరు సైతం నిలిచి ఉండటంతో ప్రయాణికులు బస్టాండులోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఎండీ దృష్టికి తీసుకురాగా, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డీఎంను ఆదేశించారు. బస్టాండు ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని, ఒకవేళ ఇప్పటికే ఉంటే వాటిని పనిచేసేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు డీపీటీఓ వరప్రసాద్, ఈడీ గోపీనాథ్ రెడ్డి, విజయవాడ ఆర్ఎం దానం, డీఎం చేకూరి సూర్యపవన్‌కుమార్, నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ శాగం రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిపై పరీక్ష



నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి యూపీ స్కూల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నూజివీడు: విద్యార్థుల అభ్యసన స్థాయిని అంచనా వేసేందుకు మండలంలోని 41 పాఠశాలల్లో నేషనల్, స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే–2023 పరీక్షను శుక్రవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పరీక్షలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లోని 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష ఏర్పాటు చేశారు. ఎంపిక చేసుకున్న భాషా సబ్జెక్టుతో పాటు గణితం సబ్జెక్టులో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 1,751 మందికి గాను 1,679 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ విద్యా సర్వే ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన స్థాయిలపై ఒక అంచనా రానుంది. దీని ఆధారంగా నిర్మాణాత్మకమైన నివేదికను అధికారులు రూపొందించనున్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యావిధానంలోని బలాలు, బలహీనతలు, లోపాలను అంచనా వేయడం, వాటిని సవరించుకోవడానికి చేపట్టాల్సిన మార్గాలను అన్వేషించుకునేందుకు వీలు కుదురుతుంది. ఓఎంఆర్ షీట్ల ద్వారా నిర్వహిస్తున్న ఈ పరీక్షను నిర్వహించేందుకు ఉపాధ్యాయులు కాకుండా ఇంజినీరింగ్ విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. పరీక్ష నిర్వహిస్తున్న పలు పాఠశాలలను ఎంఈఓ–2 జమలయ్య సందర్శించి పరిశీలించారు. రిసోర్స్‌పర్సన్ వి.రాజేంద్రప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

లేబర్ యాక్ట్‌పై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్యాంబాబు

మైలవరం: వ్యాపారులు లేబర్ యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్యాంబాబు తెలిపారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో చాంబర్ ఆఫ్ కామర్స్ మైలవరం ఆధ్వర్యంలో శుక్రవారం లేబర్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా వ్యాపారం ప్రారంభించే వారు నెల రోజుల్లో లైసెన్స్ తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ యాక్ట్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేశాయని, వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ మైలవరం అధ్యక్షుడు చలువాది మధుసూదనరావు, సెక్రటరీ మద్దినేని శ్రీనివాసరావు, ట్రెజరర్ పెండెం భీమరాజు, జాయింట్ సెక్రటరీ జాస్తీ వెంకటేశ్వరరావు, చామర్తి కృష్ణమూర్తి, సభ్యులు శీలం కోటేశ్వరరెడ్డి, జూలూరు రమేష్, దోసపాటి గిరి, సుమన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

తిరువూరు: తిరువూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ సత్యవతి తెలిపారు. తిరువూరు ముస్లింబజారు, ముష్టికుంట్ల, వామకుంట్ల, లింగాల–2, గోసవీడు–2, పెనుగొలను–4, నెమలి–1, గుళ్లపూడి–2, చైతన్యతండా, కేజీతండా, గొల్లమండల ఎస్టీ, విస్సన్నపేట కమ్మటూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 10లోపు దరఖాస్తులను తిరువూరులోని సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో రెండు పోస్టుల భర్తీ

గంపలగూడెం: గంపలగూడెం మండల రెవెన్యూ కార్యాలయంలో రెండు పోస్టులు భర్తీ అయినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.కోటేశ్వరమ్మ, జూనియర్ అసిస్టెంట్‌గా అరుణకుమార్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేర జాయిన్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమం

తిరువూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 4, 5 తేదీల్లో ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణకు, ఓటు హక్కును ఒక కేంద్రం నుంచి వేరొక కేంద్రానికి బదిలీ చేయించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని సూచించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం గంపలగూడెం మండలంలో శనివారం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని 69 పోలింగ్ బూత్‌లలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బీఎల్‌ఓలు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. జనవరి 1, 2024 నాటికి 18సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలను ఓటర్లు పరిశీలనకు సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు కూడా చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక ప్రచారం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఈనెల 4, 5 తేదీల్లో కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 53 పోలింగ్ కేంద్రాల వద్ద ఆ రెండు రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు 18ఏళ్ల నిండిన వారు ఓటు హక్కు నమోదు, పోలింగ్ కేంద్రం మార్పు, మరో నియోజకవర్గానికి ఓటు బదిలీ తదితర దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌లలో తగిన పత్రాలతో అందుబాటులో ఉండాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తిరువూరు: తిరువూరు ఫీడరుకు అత్యవసర మరమ్మతులు చేసే నిమిత్తం శనివారం ఉదయం తిరువూరు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గ నియామకం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గాన్ని శుక్రవారం నియమించినట్లు రాష్ట్ర సంఘ అధ్యక్షుడు డాక్టర్ మారేష్ తెలిపారు. అధ్యక్షుడిగా దండుగుల శివశంకర్ (ఏకొండూరు), ఉపాధ్యక్షుడిగా పల్లపు రవి (మేడూరు), కార్యదర్శిగా పోతురాజు చెన్నారావు(ముష్టికుంట్ల), ప్రధాన కార్యదర్శిగా జీ వేలాద్రి యాదవ్ (కోకిలంపాడు), కోశాధికారిగా చిన్ని శ్రీనాథ్(తిరువూరు)ను నియమించినట్లు తెలిపారు.

రైతు భరోసా లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

విస్సన్నపేట: స్థానిక ఆర్‌బీకేల వద్ద వైఎస్సార్ రైతు భరోసా లబ్ధిదారుల వివరాలను శుక్రవారం ప్రదర్శించినట్లు వ్యవసాయశాఖ వీఏఏ ఉదయ్ భాస్కర్ తెలిపారు. జాబితాను గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి చేతుల మీదుగా ప్రదర్శించారు. గ్రామంలో 821 మంది రైతుల ఖాతాలలో రూ.2 వేలు చొప్పున ఈ నెల 7వ తేదీన వైఎస్సార్ రైతు భరోసా నగదు జమ అవుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. రైతు సలహామండలి మండల సభ్యుడు కోటా శ్రీనివాసరావు, నాయకులు కోటా పుల్లారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

6న మండల సమావేశం

విస్సన్నపేట: మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. స్థానిక మండలపరిషత్ ఆవరణలో వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం మీటింగ్ హాల్లో నిర్వహించే సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

దేవునిపై విశ్వాసం ఉండాలి



ఆర్‌సీఎం చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ఫాదర్ జాన్ పీటర్

మైలవరం: దేవునిన విశ్వసించువాడు మరణించినను జీవింతురని రెవరెండ్ ఫాదర్ బి.జాన్ పీటర్ తెలిపారు. మైలవరం శాంతి నగర్‌లోని ఆర్‌సీఎం చర్చ్‌లో నెలలో మొదటి శుక్రవారం భక్తియుత కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మనిషి జీవితం నీటి మీద బుడగ వంటిదని, ఏ క్షణంలో ఏమి జరుగుతుందో తెలియదన్నారు. ఈ కొద్దిపాటి జీవిత ప్రయాణంలో యేసు మీద ఆధారపడి జీవించాలన్నారు. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో పవిత్ర జపమాల, దివ్య బలిపూజ, దివ్య ప్రసాద ఆరాధన, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు.

కృత్రిమ అవయవాలతో నూతన జీవితం

ఆగిరిపల్లి: పుట్టుకతో గాని, ప్రమాదంలో గాని అవయవాలు పోగొట్టుకున్న దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచడం ద్వారా నూతన జీవితాన్ని అందిస్తాయని దాత మండవ రమాదేవి అన్నారు. తోటపల్లి గ్రామంలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో పశ్చిమగోదావరి జిల్లా యర్నగూడేనికి చెందిన కె.జోగయ్య, రాజమండ్రికి చెందిన టి.లక్ష్మణ్, నూజివీడుకు చెందిన ఎస్.క్రిస్టియన్ రాజు, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన పి.దేవయ్య, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన మహమ్మద్ రఫీకు శుక్రవారం కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో హీల్ సంస్థ ఇంగ్లండ్ ప్రతినిధి జూలీ, అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యురాలు సీతా కొత్తపల్లి, హీల్ సంస్థకు చెందిన తాతినేని లక్ష్మి, డాక్టర్ అనితా బొబ్బా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో రైతులకు పెద్దపీట

ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు



ఈదరలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రైతులకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఈదర గ్రామంలో రూ.20.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.16.70 లక్షలతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం 75 సంవత్సరాల తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్ల సాధ్యమైందని చెప్పారు. ప్రజలకు చేరువలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమేగాక ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సకాలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. పార్టీలకతీతంగా ఎటువంటి వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అందజేస్తున్నామన్నారు.

బాబు చెప్పేవన్నీ అబద్ధాలే..

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలని, వాటిని ప్రజలు నమ్మొద్దని, ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే దోపిడీ దారులు వచ్చి వాలుతారని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ హెచ్చరించారు. త్వరలో ఈదర గ్రామంలో గడప గడపకు కార్యక్రమం మొదలుపెడతామని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైస్ ఎంపీపీ గడ్డం సాంబశివరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, ఈదర పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నపనేని వేణు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



మునునూరులో భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ముసునూరు: ప్రాధాన్యతా క్రమంలో భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని గోపవరం, వేల్పుచర్ల, ముసునూరుల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. భవన నిర్మాణాల విషయంలో జరిగిన జాప్యంపై అధికారులను ఆరా తీశారు. ప్రాధాన్యతా క్రమంలో అత్యవసరమైన భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పంచాయతీరాజ్ ఏఈ దుర్గాప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రాణి పాల్గొన్నారు.